క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



కోసూరివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెంకు చెందిన దివిసీమ సర్వోదయ సహాయక సమితి అధ్యక్షుడు కోసూరు గోపాల కృష్ణమూర్తి (ఖద్దరు గాంధీ) ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు శుక్రవారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎంపీటీసీ ద్వారకానాథ్‌కు పరామర్శ

చల్లపల్లి: ఇటీవల అనారోగ్యానికి గురై మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చల్లపల్లి మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్‌ను ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శించారు.

స్థల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో శుక్రవారం జగనన్న లేఅవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పంపిణీ చేశారు. ఇటీవల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్నారు. స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను ప్రభుత్వం అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడి

కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సెబ్, ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. పోలాటితిప్ప గ్రామంలో కొంతమంది సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సెబ్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి 17 వందల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో సారా తయారుచేసినా, అమ్మకాలు జరిపినా వెంటనే తమకు సమాచారం అందజేయాలని సీఐ సత్యనారాయణ గ్రామస్తులను కోరారు. తయారీదారులను పట్టుకుని కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

పంటకాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కృత్తివెన్ను: బంటుమిల్లి, లక్ష్మీపురం ప్రధాన పంట కాలువపై గాంధీనగరం గ్రామాన్ని చేరేందుకు అవసరమైన వంతెన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు కోటి రూపాయల అంచనాలతో ఈ వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఎంపీ ల్యాడ్స్ నుంచి ఈ నిధులు మంజూరయ్యాయని, త్వరలో వంతెన పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఆచంట

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఆచంట రంగనాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనం వద్ద శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని రంగనాయకులు తెలిపారు. ఆయన్ను పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు.

పోలవరంలో అగ్ని ప్రమాదం

గూడూరు: మండలంలోని పోలవరం ఎస్టీ కాలనీలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో అమృత అంజలికి చెందిన ఒంటి నిట్టాడి తాటాకు ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి అంతా కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న బందరు అగ్నిమాపకదళం వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.1.75 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. బాధిత కుటుంబానికి శుక్రవారం ఉదయం వీఆర్వో కుందేటి ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు బూసం గిరిజామోహన్‌రావు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

చిల్లర దుకాణంలో అగ్ని ప్రమాదం

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చిల్లర దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగిన ఘటన కోడూరులో శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని యర్రారెడ్డివారిపాలెంలో కోట నాగశ్రీనివాసరావు- వెంకటేశ్వరమ్మ దంపతులు రేకుల షెడ్డులో చిల్లర దుకాణంతో పాటు టిఫిన్ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 6.30 గంటల సమయంలో దుకాణం లోపల నుంచి మంటలు వ్యాపించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరగ్గా, హోటల్‌లోని గ్యాస్‌బండపై అగ్నికీలలు పడడంతో అది పేలింది. దీంతో దుకాణంలోని ఫ్రిజ్‌లు, హోటల్ సామగ్రి, పచారీ సరుకులు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ బాధిత కుటుంబానికి రూ.5వేల నగదును అందించారు. అవనిగడ్డ ఫైర్ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

హరహర మహాదేవ..శంభో శంకర!


- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానాలు
- పితృదేవతలకు పిండప్రదానాలు
- పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ప్రత్యేక అలంకారంలో విశ్వనాథపల్లి కాశీవిశ్వేశ్వరుడు



పెదకళ్లేపల్లి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలైనులో భక్తులు



మచిలీపట్నం రామలింగేశ్వరస్వామి ఆలయంలోని మహా శివుని విగ్రహం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి గ్రామం శివన్మామ స్మరణతో మార్మోగింది. ప్రధాన రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో స్నానమాచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయప్రాంగణంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధర రావు ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. తెల్లవారుజామునుంచే స్నానాలకు అవకాశం ఇవ్వడంతో నదిలో స్నానాలు చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. నది ఒడ్డున ఏర్పాటు చేసిన షామియానాల్లో పితృదేవతలకు పిండ ప్రదానం నిర్వహించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జంగమ దేవరలు శంఖువులు ఊది పితృ దేవతలను స్మరించారు. జల్లు స్నానం కూడా ఏర్పాటు చేయడంతో వృద్ధులు, పిల్లలు పైప్‌లైన్ కింద స్నానాలు చేశారు.

వెల్లివిరిసిన సేవా భావం

స్నేహ సొసైటీ, పెన్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఓంకార పీఠాధిపతి విజయానందగిరి స్వామీజీ, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ కలసి ప్రారంభించారు. సుమారు 15వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పెదప్రోలుకు చెందిన కూరపాటి కోటేశ్వర రావు సుమారు 15 వేల మందికి రవ్వకేసరి, పులిహోర అందించారు. వెంకటాపురానికి చెందిన కోనేరు వెంకటరామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ పంపిణీ చేసినట్లు కందుల కృష్ణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ తనయుడు వికాస్ ప్రారంభించారు. ఎస్ఎంహెచ్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఆరజా ఆశాదేవి మజ్జిగ పంపిణీ చేశారు. అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

కోడూరులో...

కోడూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శుక్రవారం ఉదయం నుంచే స్వామివార్ల దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద క్యూ కట్టారు. కోడూరులోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో లింగాకారుడికి బిల్వపత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్లేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తి ప్రపత్తులతో చేసి, నాగాభరణాన్ని అలంకరించారు. వేణుగోపాలపురంలోని అంబికా సమేత అమర లింగేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న 108 శివలింగాలకు మహిళలు విశేష పూజలు చేశారు. హంసలదీవి, విశ్వనాథపల్లిలోని కాశీ విశ్వేశ్వర స్వామి, మాచవరంలోని రామలింగేశ్వరస్వామి, సాలెంపాలెంలోని అగస్త్యేశ్వరస్వామి, పిట్టల్లంకలోని బాలనాగేశ్వరస్వామివారి ఆలయాల్లో శివరాత్రి పూజలను భక్తి ప్రపత్తులతో జరిపారు. ఆలయ కమిటీల నిర్వాహకులు, గ్రామ ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కృష్ణాతీరంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసేందుకు భక్తులు కృష్ణానది తీరానికి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉల్లిపాలెంలోని పుష్కర ఘాట్ వద్ద పిండ ప్రదానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోడూరు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఈ ఘాట్ వద్ద పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసి నదిలో కలిపారు. ఘాట్ వద్ద ఉన్న లింగాకారుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హంసలదీవిలోని సాగరతీరం వద్ద కూడా భక్తుల కోలాహలం కనిపించింది.

మచిలీపట్నంలో...

మచిలీపట్నంటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం నగరంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే అభ్యంగనస్నానాలు ఆచరించి పలు శైవక్షేత్రాలకు తరలివెళ్లడంతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. నగరంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని మహాశివుని విగ్రహం వద్ద విశేషపూజలు, మహామంగళ హారతులు నిర్వహించారు. నాగులేరు కట్టపై ఉన్న రసలింగేశ్వరస్వామి ఆలయం, గొడుగుపేట, గాంధీబొమ్మ, బచ్చుపేట, ఖొజ్జిల్లిపేట, శివగంగ, చింతగుంటపాలెం, జోడుగుళ్లు, అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం తదితర శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

నాగులేరు తీరంలో పుణ్యస్నానాలు, పింఢ ప్రదానాలు...

నగరంలోని నాగులేరు కాలువలో స్నానాలు ఆచరించిన అనంతరం పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న ఏడు ఘాట్లలో భక్తులు స్నానాలు ఆచరించారు. మహిళలు వాయినాలు తీర్చుకున్నారు. గట్టు వద్ద ఉన్న రసలింగేశ్వరస్వామి ఆలయం, నాగేశ్వర స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న యాచకులకు భక్తులు బియ్యం, నగదును ఇచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, పులిహోర, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లు, శీతలపానీయాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను కమిషనర్ బాపిరాజు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మౌనిక పర్యవేక్షించారు.

పెడనలో...

పెడన: పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేకువజాము నుంచే పెడన పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొందరు పితృదేవతలకు పిండప్రదానాలు చేసి బ్రాహ్మణులకు స్వయంపాకాలను అందజేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించడంతో సుమారు 2వేలకు పైగా భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. బ్రహ్మపురంలోను, పోలవరంలోను శ్రీరామలింగేశ్వర చౌడేశ్వరి ఆలయాల వద్ద కూడా అన్న సమారాధనలు నిర్వహించారు. పట్టణంలోని కాపులవీధిలో పార్వతీపరమేశ్వరుల చిత్రపటంతో ఉన్న ప్రభను ట్రాక్టర్‌పై ఉంచి పురవీధులలో ఊరేగించారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొలువై ఉన్న శివాలయాలు శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి. బంటుమిల్లి శ్రీ గంగాపార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి, పెదతుమ్మిడి శ్రీ పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి, అర్తమూరు శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, ములపర్రు శ్రీ పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, ఆముదాలపల్లి శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, కంచడం శ్రీ కాత్యాయినీ సమేత కనకలింగేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో పండితుల వేద మంత్రాల మధ్య మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కృత్తివెన్నులోని శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు జరిపారు. భారీగా భక్తులు తరలిరావడంతో దర్శనానికి సమయం తీసుకుంది. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మచిలీపట్నం పార్లమెంటు మాజీ సభ్యుడు బాడిగ రామకృష్ణ దంపతులు, మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నసమారాధన నిర్వహించారు.

ఎడ్లంకలో...

అవనిగడ్డ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎడ్లంకలో బాలకోటేశ్వర స్వామిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వర రావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పశుపోషకులు తమ గేదెలు, ఎద్దులను ఆలయం చుట్టూ తిప్పి పశుపతిగా పేరొందిన బాలకోటేశ్వర స్వామివారికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కృష్ణానది ఒడ్డున కొంతమంది పితృదేవతలకు పిండార్పణ సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

యార్లగడ్డలో...

చల్లపల్లి: మహా శివరాత్రి వేడుకలు యార్లగడ్డ పుట్టతీర్థంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని నాగమల్లి కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమలు సమర్పించారు. స్వామివారికి వేడి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామపెద్దలు, కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మూగ జీవాలను కాచి రక్షించే స్వామిగా పేరున్న క్షేత్రం కావటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, ఎడ్లను తోలుకుని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

ఘంటసాలలో...

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల, శ్రీకాకుళం గ్రామాల్లో ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం, శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల విశ్వేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు ఘంటసాల విజయలక్ష్మి, మాధవీలత, సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం బిందుతీర్థం, విఘ్నేశ్వరపూజ, తదితర పూజలు నిర్వహించగా సాయంత్రం జగజ్జ్యోతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శివరామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీకాకుళంలోని శివాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంకటావలో...

గూడూరు: కంకటావలో ప్రసిద్ధి చెందిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి దివ్య కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది.



యార్లగడ్డలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కృత్తివెన్ను శివాలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



కంకటావలోని శ్రీ అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మచిలీపట్నం: మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ శైవక్షేత్రాలైన పెదకళ్లేపల్లి, ఐలూరుకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. ఐలూరుకు 18 బస్సులు, పెదకళ్లేపల్లికి 21 బస్సులు మొత్తం 39 బస్సులను నడిపినట్లు ఆర్టీసీ డీఎం టి.పెద్దిరాజు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ చార్జీలనే వసూలు చేసినట్లు తెలిపారు.

సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలలో భక్తుల సందడి

నాగాయలంక: మండలంలోని వివిధ శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగమేశ్వరంలో శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తజనం పోటెత్తారు. కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) ఆధ్వర్యంలో భక్తులకు చల్లని మజ్జిగ, రస్నా పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు సంగమేశ్వరుని దర్శించుకుని పూజలు జరిపారు. గణపేశ్వరంలోని శ్రీదుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో గణపేశ్వరస్వామికి అభిషేకాలు జరిపారు. నాగాయలంకలోని శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో 11రకాల అభిషేకాలు, విశేషపూజలు జరిగాయి. కృష్ణాతీరంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ అభిషేకాలు, శివపార్వతీ కల్యాణం, ప్రత్యేకపూజలు జరిగాయి శ్రీరామ పాద క్షేత్రం ఘాట్‌లో ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2500 మందికి అన్నసంతర్పణ జరిపారు.

కనులపండువగా జగజ్జ్యోతి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామివారి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి జగజ్జ్యోతి కార్యక్రమం కనులపండువగా, వైభవోపేతంగా నిర్వహించారు. చల్లపల్లి జమీందారీ వంశీకులు, అనువంశిక ధర్మకర్తలు అంకినీడు ప్రసాద్, పద్మనాభ ప్రసాద్, శివరామ్‌ప్రసాద్, ప్రవీణ్‌చంద్ర ప్రసాద్, వివేక వర్ధన్ ప్రసాద్‌లకు సంప్రదాయబద్ధంగా గ్రామపెద్దలు ఎదురేగి మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెద్ద ప్రమిదలో హరహరా... అంటూ పెద్ద పెట్టున నినాదాలతో వత్తులు వెలిగించి స్వామివార్లకు హారతి పట్టారు. అంతకుముందు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో తెల్లవారుజాము 2 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు అమ్మవార్లకు సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం ఉదయం 4 గంటల నుంచి భక్తులకు శ్రీ స్వామివారి అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటలకు నిత్య బలిహరణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. జగజ్జ్యోతిని దర్శించి, వెలిగించిన భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ నాగప్రసాద్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



పెదకళ్లేపల్లిలో జగజ్జ్యోతి వెలిగిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్తలు



పెదకళ్లేపల్లి వద్ద నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



ఉల్లిపాలెం వద్ద పితృదేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు



పెడన అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల కోలాహలం



నాగులేరు కాలువలో పిండప్రదానం చేస్తున్న భక్తులు



నాగాయలంకలో కృష్ణానది ఒడ్డున పితృదేవతల పిండ ప్రదాన క్రతువుల సందడి

మహిళా అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: మహిళా అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, రచయిత్రి సింహాద్రి పద్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా మహిళా దినోత్సవం

మచిలీపట్నంటౌన్: అవోపా మహిళా విభాగ్, బందరు మండల ఆర్యవైశ్య మహిళా విభాగ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజుపేటలోని ఆనంద ఆశ్రమంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పేస్ట్‌లు, బట్టల సబ్బులు, సుగంధ, ఖర్జూరం, హార్లిక్స్ అందజేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. సంఘ అధ్యక్షురాలు తుమ్మలపల్లి విశాలాక్షి, కార్యదర్శి సామా అన్నపూర్ణ, కోశాధికారి మాటూరి శ్రీలక్ష్మి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత వికాస్



వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న మహిళలు

పింఛనుదారుల దాతృత్వం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 29వ డివిజన్ వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. డివిజన్‌కు చెందిన పింఛనుదారు మెట్ల నాగదుర్గాంబ ఇటీవల మృతి చెందింది. దీంతో తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున మొత్తం రూ.37,900 నగదును శుక్రవారం నాగదుర్గాంబ కుటుంబ సభ్యులకు డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. సాయం అందించిన పింఛనుదారులకు నాగదుర్గాంబ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కోనేరుసెంటర్: మండల పరిధిలోని మంగినపూడి, పోతేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లకు సంబంధించిన 33 కె.వి. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా అర్చకులకు ఘనంగా సత్కారం



ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం విశ్వేశ్వర స్వామి దేవాలయంలో మహిళా అర్చకులను సన్మానించారు. ఆలయంలో గత 43 ఏళ్లుగా అర్చకత్వం చేస్తున్న మహిళా అర్చకులు ఘంటసాల విజయలక్ష్మి, ఆమె సోదరి ఘంటసాల మాధవీలతలను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వీరిద్దరూ ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కుటుంబీకులు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివరామకృష్ణ, జి.వర్ధన్, అర్చకులు సాయి రామకృష్ణ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సహాయ ఫౌండేషన్

బంటుమిల్లి: బాధితులకు మేమున్నామంటూ ఆపద సమయంలో ఆపన్న హస్తం అందించే పెడన పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ మరోసారి మానవత్వం చాటుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన గడ్డం శోభన్‌బాబు భార్య సుప్రియ 9 నెలల గర్భిణి. పురుడు కోసం గత నెల 26న మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. 27న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అదేరోజు సాయంత్రానికి సుప్రియకు ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో విజయవాడ పెద్ద ఆసుపత్రికి పంపించారు. అక్కడ గత 8 రోజులుగా చికిత్స పొందుతూ ఈ నెల 7వ తేదీన మరణించింది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబానికి చెందిన శోభన్‌బాబు ఆర్థిక సాయం చేయాలంటూ ఫౌండేషన్‌ను అర్థించాడు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్‌బాషా, సభ్యుడు రైతుల ప్రసాదు విజయవాడ ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి పురిటి బిడ్డకు కావలసిన పాల డబ్బాలు, మందులతో పాటు శోభన్‌బాబుకు ఆస్పత్రి ఆర్ఎంఓ, ఇతర వైద్యుల చేతుల మీదుగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.